కరుణించని వరుణుడు

- వాడుతున్న ముందస్తు పంటలు
- ఆందోళనలో అన్నదాతలు


గుంతకల్లు సమీపంలో నల్లటి మబ్బులతో ఊరిస్తున్న మేఘాలు


వర్షం లేక వాడుముఖం పడుతున్న ఆముదం పంట

గుంతకల్లు రూరల్: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌కు ముందే తొలకరి వర్షాలతో ఊరించిన వరణుడు ఆ తరువాత ఉసూరుమనిపించాడు. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా వర్షాలు పడటం లేదు. దట్టమైన మేఘాలు ఆకాశాన్ని కమ్మేస్తున్నా చినుకు రాలడం లేదు. దీంతో ఇప్పటికే సాగుచేసిన పంటలు ఓ వైపు క్రమంగా ఎండుముఖం పడుతుంటే, మరోవైపు పొలాలను సాగుకు సిద్ధం చేసుకున్న రైతన్నలు వరణుడి కోసం కోసం ఆకాశం వైపు ఎదురుచూపులు చూస్తున్నారు. గడచిన రెండేళ్లుగా తీవ్రమైన పంటనష్టంతో అప్పుల ఊబిలో కూరుకుపోయిన రైతన్నలు ఈ ఏడాది పంటసాగుకు చేతిలో చిల్లిగవ్వ లేక ప్రభుత్వం ఇస్తామన్న అన్నదాత సుఖీభవ ఆర్థిక సాయం కోసం ఆశగా ఎదురుచూస్తూ వచ్చారు. అలవిగాని హామీలతో గద్దెనెక్కిన కూటమి ప్రభుత్వం వరుసగా రెండో ఏడాది కూడా రైతన్నలకు మొండిచెయ్యి చూపించడంతో దిక్కుతోచని స్థితిలో అప్పులు చేసి మరీ పంటసాగుకు సిద్ధమయ్యారు. ఖరీఫ్ సాగుకు ముందే తొలకరి వర్షాలు పలకరించడంతో ఈ ఏడాది తమ కష్టాలు తీరిపోతాయని ఎంతో ఆశగా ముందస్తు పంటసాగు చేపట్టారు. మండలంలో దాదాపు 52 వేల ఎకరాల సాగు భూమి ఉండగా 7,320 ఎకరాల్లో కంది, 5,472 ఎకరాల్లో వేరుశనగ, 1,325 ఎకరాల్లో ఆముదం, 382 ఎకరాల్లో మొక్కజొన్న తదితర పంటలను నెలరోజుల క్రితం సాగు చేశారు. పంటసాగు చేపట్టి నెలరోజులు గడుస్తున్నా ఇంతవరకూ చినుకు జాడ లేదు. దీంతో సాగు చేసిన పంటలు క్రమంగా వాడుముఖం పడుతున్నాయి. దీంతో ఎకరాకు రూ.20 వేల వరకూ ఖర్చుపెట్టి పంటసాగు చేపట్టిన రైతులు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. మండలంలో మరో 30 వేల ఎకరాలకు పైగా పంటసాగు చేయాల్సి ఉండగా రైతులు విత్తనాలు, ఎరువులు, పొలాలను సిద్ధం చేసుకుని పదునైన వర్షం కోసం ఎదురుచూస్తున్నారు. మరో 10 రోజుల్లో ఖరీఫ సీజన్ అదును సమయం దాటిపోతున్న తరుణంలో వర్షాలుపడకపోతే తమ పరిస్థితి ఏమిటని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పంట ఎండుతోంది..



ఎకరాకు రూ.20 వేల వరకూ ఖర్చుపెట్టి 20 రోజుల కిందట రెండెకరాల్లో కంది పంట సాగు చేశా. పంటసాగు చేసిన రోజు నుంచి ఇప్పటివరకూ వర్షం పడకపోవడంతో కందిపంట క్రమంగా వాడుముఖం పడుతుంది. మరో వారం పది రోజుల్లో వర్షం పడకపోతే పంట పూర్తిగా దెబ్బతినే పరిస్థితి ఉండటంతో దిక్కుతోచడం లేదు.
– సాయికుమార్, రైతు, పాతకొత్తచెరువు

అదును దాటుతున్నా వాన లేదు



నాకు 2.5 ఎకరాల భూమి ఉంది. ఈ ఏడాది వేరుశనగ సాగు చేయాలనే ఉద్దేశంతో విత్తనాలు, ఎరువులు కొనుగోలు చేసి సిద్ధంగా ఉంచాను. కానీ నెలరోజులుగా వాన జాడ లేదు. మరో 10 రోజుల్లో పంటసాగుకు అదును దాటిపోతుంది. అప్పటికీ వర్షం పడకపోతే ఏం చేయాలో తెలియడం లేదు.
– చిన్న ఆంజనేయులు, రైతు, వైటీ చెరువు

యూరియా పిచికారీ చేయాలి



మండలంలో దాదాపు 18 వేల ఎకరాల్లో ఇప్పటికే వివిధ రకాల పంటలు సాగు చేశారు. ఆ పంటలు ఎండిపోకుండా బెట్టను అధిగమించేందుకు లీటర్ నీటికి 10 గ్రాముల యూరియాను కలిపి ఎకరాకు 200 లీటర్లతో పిచికారీ చేసుకోవాలి. లేదా 19 19 19 మందు లేదా 17 17 17 మందును లీటర్‌కు 8 గ్రాముల చొప్పున కలిపి ఎకరాకు 200 లీటర్ల నీటితో పిచికారీ చేసుకోవాలి.
– లీనా వసుంధర, వ్యవసాయాధికారి

క్లుప్తంగా

విద్యార్థులు పౌష్టికాహారం తీసుకోవాలి


మాట్లాడుతున్న డాక్టర్ నారాయణ స్వామి

గార్లదిన్నె: విద్యార్థులు రోజూ పౌష్టికాహారం తీసుకోవాలని రాష్ట్రీయ బాల స్వాస్థ్య కార్యక్రమం (ఆర్‌బీఎస్‌కే) ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి సూచించారు. శనివారం మండలంలోని కల్లూరు జిల్లా పరిషత్ హైస్కూల్లో ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాంలో భాగంగా విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పోషకాహారం, పొగాకు వాడడం వల్ల వచ్చే పరిణామాలు, జాతీయ నులిపురుగుల నిర్మూలన, డెంగీ మాసోత్సవంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గార్లదిన్నె పీహెచ్‌సీ డాక్టర్ మంజుల, చిన్న పిల్లల సైకాలజిస్టు సుందరరావు, మేనేజర్ రజిత, సర్పంచు ప్రశాంతి, జగ్గాల రవి, సీహెచ్‌ఓ లోకనాథ్, వైద్యసిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

'ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో చేరండి'

గుంతకల్లుటౌన్: పదోతరగతి పాసైన విద్యార్థులు ఎస్‌కేపీ ప్రభుత్వ డిగ్రీ కళాశాల(అటానమస్)లో చేరి ఉజ్వల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసుకోవాలని ఎమ్మెల్యే జయరామ్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన ఇంటర్ మొదటి సంవత్సరం అడ్మిషన్లకు సంబంధించి పూర్తి వివరాలతో ముద్రించిన వాల్‌పోస్టర్లను విడుదల చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ రవిశంకర్ శర్మ, అధ్యాపకులు డాక్టర్ గోపీనాయక్, డాక్టర్ బాలకృష్ణ, ఎస్.నారాయణ, పీడీ సురేష్, సీనియర్ అసిస్టెంట్ సాయికిరణ్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

డీఎఫ్‌ఓ ఆకస్మిక తనిఖీ


నర్సరీని పరిశీలిస్తున్న డీఎఫ్‌ఓ విఘ్నేష్

పామిడి: పట్టణంలోని ఫారెస్ట్ బంగ్లాలో ఉన్న నర్సరీని శనివారం డీఎఫ్‌ఓ విఘ్నేష్ అప్పావు ఆకస్మిక తనిఖీ చేశారు. ఈసందర్భంగా ఆయన నర్సరీ ప్రాంతాన్ని మొత్తాన్ని పరిశీలించారు. త్వరలో రైతులకు మొక్కలను ఉచితంగా అందజేస్తామన్నారు. ఒక్కో రైతుకు ఆధార్ కార్డు మీద మునగ, బొప్పాయి దానిమ్మ, ఉసిరి, చింత, వెలగ, టేకు మొక్కలు వంద అందజేస్తామన్నారు. డీఎఫ్‌ఓ వెంట ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ హెచ్ కరీముల్లా ఉన్నారు.

రైతు సంక్షేమానికి కృషి చేయాలి


రైతులకు వ్యవసాయ పరికరాలు అందజేస్తున్న శాస్త్రవేత్తలు, అధికారులు

బుక్కరాయసముద్రం: రైతుల సంక్షేమానికి శాస్త్రవేత్తలు, వ్యవసాయ శాఖ అధికారులు కృషి చేయాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఉమా మహేశ్వరమ్మ సూచించారు. శనివారం మండలంలోని రేకులకుంటలో ఉన్న పరిశోధనా స్థానంలో అఖిల భారత సమన్వయ వాతావరణం పరిశోధనా పథకం, జాతీయ వాతావరణ అనుకూల వ్యవసాయ పథకం హైదరాబాద్ ప్రతినిధుల సహకారంతో ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ విజయ శంకర్‌బాబు అధ్యక్షతన షెడ్యూలు కులాల రైతులకు వ్యవసాయ పనిముట్లు, టార్పాలిన్, సైకిల్ వీవర్, స్ప్రేయర్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు మాధవీలత, డాక్టర్ నటరాజ్, డాక్టర్ సుధీర్, డాక్టర్ నజీరుద్దీన్, డాక్టర్ లక్ష్మికళ్యాణి, డాక్టర్ జాహ్నవి, రైతులు పాల్గొన్నారు.

రుక్మిణీ పాండురంగస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం


అలంకరణలో పాండురంగస్వామి

పామిడి: పామిడిలో డబ్బేదార్, రంగసుభే ఫిర్కాల ఆధ్వర్యంలో శనివారం వేర్వేరుగా రుక్మిణీ పాండురంగ స్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా పెద్ద, చిన్న విఠోబస్వామి ఆలయాల్లో రుక్మిణీ పాండురంగస్వామి దేవతామూర్తుల విగ్రహాలను శోభాయానంగా అలంకరించారు. వేదపండితుల మంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా పాండురంగస్వామి భక్తుడు జ్ఞానేశ్వర మహారాజ్ విరచిత మరాఠి భగవద్గీత (జ్ఞానేశ్వరి) పుస్తకాన్ని భావసార క్షత్రియ భజన మండలి ఆధ్వర్యంలో విఠోబస్వాముల దేవాలయాల వరకూ ఊరేగించి, ప్రతిష్ఠించారు. భక్తులు పాండురంగస్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

వైఎస్సార్ జయంతిని విజయవంతం చేద్దాం



శింగనమల/బుక్కరాయసముద్రం/పుట్లూరు: దివంగత ముఖ్యమంత్రి మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి జయంతిని ఈనెల 8న నియోజకవర్గంలో విజయవంతం చేద్దామని మాజీ మంత్రి, నియోజకవర్గ సమన్వయకర్త సాకే శైలజానాథ్ వైఎస్సార్‌సీపీ శ్రేణులకు శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. జయంతిని పురస్కరించుకొని మండలాల్లో మహానేత వైఎస్సార్ విగ్రహాలకు పూలమాలలు వేసి, ఘనంగా నివాళులర్పించాలన్నారు. ఉదయం 8 గంటలకు బుక్కరాయసముద్రం, 9.30 గంటలకు శింగనమల, 11 గంటలకు నార్పల, 12.30 గంటలకు పుట్లూరు, 4 గంటలకు గార్లదిన్నెల్లో నిర్వహించే కార్యక్రమాల్లో పాల్గొంటానన్నారు. కార్యక్రమానికి జెడ్పీటీసీలు, ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు పాల్గొన్ని విజయవంతం చేయాలన్నారు.

▸▸ బుక్కరాయసముద్రం మండల కేంద్రంలోని ముసలమ్మ కట్ట వద్ద ఉన్న వైఎస్సార్ సర్కిల్‌లో మహానేత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహం ఎదుట ఈ నెల 8న వైఎస్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు గువ్వల శ్రీకాంత్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

▸▸ పుట్లూరు మండలకేంద్రంలో ఈ నెల 8న నిర్వహించే వైఎస్సార్ జయంతి వేడుకలను విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల కన్వీనర్ పొన్నపాటి మహేశ్వరెడ్డి కోరారు. శనివారం ఆయన మండలకేంద్రంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి నియోజకవర్గ సమన్వయకర్త మాజీ మంత్రి సాకె శైలజానాథ్ హాజరవుతారన్నారు. పెద్ద ఎత్తున పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి రమణ యాదవ్, సర్పంచ్ ఓబులేసు, మాజీ ఎంపీటీసీ పోలిరెడ్డి, నాయకులు రమణారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నరసింహారెడ్డి, సుధాకర్‌రెడ్డి, నారాయణ స్వామి, మద్దిలేటి, సాంబశివారెడ్డి పాల్గొన్నారు.

అప్పులు చేయడంలో కూటమి రికార్డు


కూటమి ప్రభుత్వ అప్పుల పోస్టర్ విడుదల చేస్తున్న ఐటీ విభాగం నాయకులు

గుంతకల్లు: ఏడాది కాలంలో దేశంలో ఏ రాష్ట్రం చేయని అప్పులు కూటమి సర్కార్ చేసి, రికార్డులకు ఎక్కిందని వైఎస్సార్‌సీపీ ఐటి విభాగం జిల్లా అధ్యక్షుడు వై.రాజశేఖర్‌రెడ్డి విమర్శించారు. శనివారం స్థానిక మాజీ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏడాది కాలంలో కూటమి ప్రభుత్వ చేసిన అప్పులపై మాట్లాడారు. కూటమి ప్రభుత్వం హామీలను పక్కనపెట్టి కేవలం రెడ్ బుక్ రాజ్యాంగం అమలుల్లో భాగాంగా అక్రమ కేసులు పెట్టడం తప్ప ఏమీ చేయలేదన్నారు. ఈ ఏడాది కాలంలో ఇచ్చిన హామీల్లో ఒక్క పథకం కూడ సక్రమంగా అమలు చేయలేదన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రజల అకౌంట్లలోకి దాదాపు నాలుగు లక్షల కోట్ల రూపాయలు నేరుగా వేశారన్నారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక సంస్కరణలు చేపట్టి 3.50 లక్షల ప్రభుత్వ ఉద్యోగులు ఇచ్చారని గుర్తు చేశారు. కూటమి ప్రభుత్వం ఒక్క ఉద్యోగం ఇవ్వకుండా మోసం చేస్తోందన్నారు. కార్యక్రమంలో ఐటీ విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు సూర్యప్రకాష్ రెడ్డి, నాయకులు మద్దికెర ప్రతాప్, దిలీప్, కుమార్, సందీప్, కర్ణ తదతరులు పాల్గొన్నారు.

విద్యుత్ చార్జీలను తగ్గించాలి


గుంతకల్లులో ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు

సాక్షి నెట్‌వర్క్: గుంతకల్లు, శింగనమల, తాడిపత్రి నియోజకవర్గాల్లోని అన్ని మండలాల్లో శనివరాం విద్యుత్‌చార్జీలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ సీపీఐ నాయకులు ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా ఆ పార్టీ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టి ఏడాది కాలంలోనే విద్యుత్ సర్దుబాటు చార్జీలు పేరుతో రూ.15,485 కోట్లు భారాన్ని ప్రజలపై మోపిందిన్నారు. అంతేకాకుండా స్మార్ట్ మీటర్లు బిగించడంతోపాటు మరోసారి విద్యుత్ చార్జీలు పెంచడానికి కుట్రపూరితంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. ప్రతిపక్షంలో ఉన్న సమయంలో చంద్రబాబు విద్యుత్ చార్జీలు పెంపకాన్ని తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. స్మార్ట్ మీటర్లును అడ్డుకోవాలని..అవసరమైతే పగలగొట్టాలని ప్రజలకు సూచించారన్నారు. అలాగే అధికారంలోకి వస్తే విద్యుత్ చార్జీలను పెంచబోమని..అవసరమైతే తగ్గిస్తామని చెప్పారన్నారు. కానీ ఈ ఏడాది కాలంలోనే నాలుగు సార్లు విద్యుత్ చార్జీలు పెంచడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. విద్యుత్ చార్జీలను తగ్గించడం, స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ఉపసంహరించుకోవడంతోపాటు అక్రమంగా జరిగిన సోలార్ విద్యుత్ ఒప్పందాన్ని రద్దు చేసుకోవాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడుతామని హెచ్చరించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాలను విద్యుత్ అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. కాగా తాడిపత్రి పట్టణంలో సీపీఐ నాయకులు రెండు వర్గాలుగా విడిపోయి ధర్నా కార్యక్రమాలు నిర్వహించడంతో.. ఆ పార్టీలోని విభేదాలు బయటపడ్డాయి.

కక్షిదారులకు రాజీ మార్గమే రాజ మార్గం


తాడిపత్రిలో లోక్ అదాలత్ నిర్వహిస్తున్న మెజిస్ట్రేట్ అనిల్‌కుమార్


గుత్తిలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్న ఏడీజే సాధుబాబు

తాడిపత్రి రూరల్: రాజీ మార్గమే రాజ మార్గమని ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ అనిల్‌కుమార్ అన్నారు. స్థానిక కోర్టులో శనివారం జరిగిన జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా రాజీ కింద 49 కేసులు, ఎక్సైజ్ కింద 19 కేసుల్లో రూ.1.04 లక్షలు, ఐపీసీ అడ్మిషన్ కింద 60 కేసుల్లో రూ.2.88 లక్షల జరిమానా వసూలు, ఎన్‌ఐ యాక్ట్ కింద ఒక కేసులో రూ.1.50 లక్షలకు సెటిల్ జరిగిందని ఆయన తెలిపారు. ఎంసీ కింద మూడు కేసుల్లో రూ.2లక్షలు, 5 సివిల్ కేసుల్లో రూ.3.15 లక్షలతో రాజీ, ఈపీ కింద మూడు కేసుల్లో రూ.4.25 లక్షల రాజీ జరిగిందన్నారు. పీఎల్‌సీ కేసులో రూ.5 లక్షలు సెటిల్ చేశామన్నారు. సెకండ్ క్లాస్ కోర్టు కింద 164 కేసుల్లో రూ.62 వేలకు సెటిల్ జరిగిందని మెజిస్ట్రేట్ తెలిపారు. కార్యక్రమంలో బార్ అసోషియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సభ్యులు చక్రపాణి, అంజాద్, సీనియర్ న్యాయవాదులు ఎన్‌వీ భాస్కర్‌రెడ్డి, మునయ్య, ఆర్‌సీ రజనీకాంత్‌రెడ్డి, రఘుపతి, ప్రభు, ఏవీ రమణారెడ్డి, శంకర్‌రెడ్డి, శివయ్య, క్రిష్ణయ్య, హనీఫ్, కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

గుత్తి: పట్టణంలోని ఏడీజే, జూనియర్ సివిల్ జడ్జి, సీనియర్ సివిల్ జడ్జి కోర్టులలో శనివారం జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఏడీజే సాధుబాబు, సీనియర్ సివిల్ జడ్జి కాశీ విశ్వనాథ్ చారి ఆధ్వర్యంలో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకూ నిర్వహించిన కార్యక్రమంలో సివిల్, క్రిమినల్, ఎక్సైజ్, పీఎల్‌సీ మొత్తం 253 కేసులను పరిష్కరించారు. మధ్యాహ్నం లయన్స్ క్లబ్ సభ్యులు అన్నదానం నిర్వహించారు.

పంచాయతీలను పరిశుభ్రంగా ఉంచాలి


పెద్దవడుగూరులో మాట్లాడుతున్న ఎంపీడీఓ బారన్‌సాహెబ్


పామిడిలో మాట్లాడుతున్న ఎంపీటీసీ రాజశేఖర్

పెద్దవడుగూరు: గ్రామాలను పరిశుభ్రంగా ఉంచడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీడీఓ బారన్‌సాహెబ్ సూచించారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ శ్రీదేవి అధ్యక్షతన వచ్చిన అరకొర సభ్యులు, అధికారులతో మండల సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెటర్నరీ డాక్టర్ రమేష్ మాట్లాడుతూ మండలంలో మూడు వేల పశువులకు టీకాలు వేశామన్నారు. గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను సర్పంచ్‌లు శుభ్రం చేయించాలన్నారు. స్వచ్ఛమైన తాగునీరు తాగాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆంజినేయులు సూచించారు. అనంతరం ఎన్‌ఆర్‌ఈజీఎస్ అధికారులు మాట్లాడుతుండగా.. తెలికి ఎంపీటీసీ రామన్న అధికారులపై ధ్వజమెత్తారు. ఉపాధి హామీ ద్వారా వేల మొక్కలు నాటుతున్నా.. వాటి ఆలనా పాలన చూడక పోవడంతో ఎండిపోతున్నాయని ప్రజాధనం దుర్వినియోగం అవుతోందని మండిపడ్డారు. మండలంలోని తెలికి రహదారి, చిత్రచేడు రహదారులు అధ్వాన్నంగా ఉన్నాయని, మరమత్తులు చేయించడానికి నివేదిక సిద్ధం చేస్తున్నామని ఆర్‌అండ్‌బీ ఏఈ హనీఫ్‌వలి తెలిపారు. డీటీ వెంకటేశ్వరమ్మ, డాక్టర్ సునీత, ఎంఈఓ రాముడు, ట్రాన్స్‌కో ఏఈ షఫీపలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సజావుగా సర్వసభ్య సమావేశం

పామిడి: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ భోగాతి మురళీమోహన్‌రెడ్డి అధ్యక్షతన ఎంపీడీఓ కే తేజోత్స్నా ఆధ్వర్యంలో నిర్వహించిన సాధారణ సర్వసభ్య సమావేశం సాఫీగా సాగింది. ఈసందర్భంగా రామగిరి ఎంపీటీసీ మజ్జిగ రాజశేఖర్ పలు సమస్యలపై ప్రశ్నించారు. ఉపాధిహామీ పథకం పనుల్లో యంత్రాల వాడకంతో పాటు మస్టర్‌లో దొంగగా కూలీల పేర్లు నమోదు చేస్తున్నారంటూ ఏపీఎం ఆదినారాయణమ్మను ప్రశ్నించారు. విచారణ చేస్తామని ఆమె సమాధానమిచ్చారు. అలాగే మండలంలోని రామగిరి. పొళ్ళం, రామరాజుపల్లి తదితర యూపీ స్కూల్‌లు మోడల్‌స్కూల్‌లుగా డిమోట్ కావడంపై ఆయన ఎంఈఓ-1 జయానాయక్‌ను ప్రశ్నించారు. అది ప్రభుత్వ పాలసీ అంటూ ఆయన దాటవేశారు. అనంతరం వివిధ శాఖల ప్రగతిపై ఆయా శాఖాధికారులు వివరించారు. కార్యక్రమంలో తహసీల్దార్ సీ షర్మిల, ఏఈ మధుసూదన్‌రావు, ఏఓ విజయ్‌కుమార్, హార్టికల్చర్ ఆఫీసర్ మిత్రవింద మాధవి, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, అధికారులు, అనధికారులు తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించండి

గుత్తి రూరల్: గ్రామాల్లో ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని ఎంపీడీఓ ప్రభాకర్ నాయక్ సూచించారు. మండలంలోని మాముడూరు గ్రామంలో జరుగుతున్న పారిశుధ్య పనులను శనివారం ఎంపీడీఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన ఇంటింటికీ వెళ్లి ప్రజలకు సూచనలిచ్చారు. మురుగునీరు రోడ్లపై వదలకుండా ఇంకుడు గుంతలు తవ్వుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ ఇళ్లలో చెత్తను సేకరణకు వచ్చిన గ్రీన్ అంబాసిడర్ల చెత్త వాహనాల్లో వేసి సహకరించాలన్నారు.

మాజీ ఎమ్మెల్యేకు సన్మానం


మాజీ ఎమ్మెల్యేను కలిసిన గుత్తి పట్టణ మహిళా అధ్యక్షురాలు హేమలతారెడ్డి తదితరులు

గుత్తి: మాజీ ఎమ్మెల్యే వైవీఆర్‌ను గుత్తి పట్టణ వైఎస్సార్‌సీపీ మహిళా అధ్యక్షురాలు హేమలతారెడ్డి శనివారం సన్మానించారు. ఇటీవల ఆమె మహిళా అధ్యక్షురాలిగా ఎంపికైంది. హేమలతారెడ్డి, గోపీనాథ్ రెడ్డి, కౌన్సిలర్లు కృపా సుజాత, వాల్మీకి శివ, మహబూబ్ జాన్, పలువురు నాయకులు శనివారం గుంతకల్లుకు వెళ్లి మాజీ ఎమ్మెల్యే వై.వెంకటరామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతి రెడ్డి, జిల్లా నాయకుడు మంజునాథ్ రెడ్డిని కలసి శాలువాలు, పూల మాలలతో సత్కరించారు. హేమలతారెడ్డి మాట్లాడుతూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడొద్దు


చికిత్స పొందుతున్న బాలికను పరామర్శిస్తున్న జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి

గుంతకల్లు/గుంతకల్లు టౌన్: ప్రజా ఆరోగ్యాలతో చెలగాటమాడొద్దని వైఎస్సార్‌సీపీ జిల్లా ఉపాధ్యక్షురాలు నైరుతిరెడ్డి హెచ్చరించారు. శనివారం కలుషిత నీరు సేవించి అస్వస్థకు గురై ప్రభుత్వ ఆస్పత్రిలో చిక్సిత పొందుతున్న వారిని ఆమె పరామర్శించిన అనంతరం ఆరోగ్య పరిస్థితిపై వైద్యులతో ఆరా తీశారు. ఈ సందర్భంగా నైరుతి రెడ్డి మాట్లాడుతూ మున్సిపల్ అధికారుల నిర్లక్ష్యానికి ఈ ఘటన అద్దం పడుతోందన్నారు. మున్సిపల్ కమిషనర్‌కు సమ్మర్ స్టోరేజ్ ట్యాంకుల పరిశీలన, ఫిల్టరేషన్‌పై ఏమాత్రం శ్రద్ధ లేదని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు ఎండీఆర్ ఖలీల్, యువజన విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ బాసిద్, నాయకులు మార్కెట్ వెంకటేశ్వర్లు, మౌల, రాజశేఖర్ పాల్గొన్నారు. అలాగే కలుషిత నీరు తాగి వాంతులు, విరేచనాలతో ప్రభుత్వాస్పత్రిలో చేరిన వారిని సీపీఎం పట్టణ కార్యదర్శి మారుతి, నాయకులు జగ్గిలి రమేష్, రామునాయక్, షబ్బీర్, సంచారజాతుల సంఘం రాష్ట్ర కార్యదర్శి వై.శ్రీనివాసులు పరామర్శించారు.

అరటి సాగులో యాజమాన్య పద్ధతులు అవసరం

బుక్కరాయసముద్రం: అరటి సాగులో రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం ఉద్యాన శాస్త్రవేత్త డాక్టర్ త్రికళ మాధవి పేర్కొన్నారు. శనివారం నార్పల మండలం సిద్ధరాచర్లలో రైతులు సాగు చేసిన అరటి పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులకు పలు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఎంపీఈఓ జయ, రైతులు పాల్గొన్నారు.

పాత పద్ధతిలోనే ఐచ్ఛిక సెలవు కొనసాగించాలి

పామిడి: పాఠశాల వ్యవస్థలో ఎంతో కాలంగా వస్తున్న ఐచ్ఛిక సెలవును పాత పద్ధతిలోనే కొనసాగించాలని ఎస్టీయూ పామిడి మండల శాఖ అధ్యక్షుడు వై.రామాంజనేయులు, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి నాగభూషణం డిమాండ్ చేశారు. శనివారం స్థానిక ఎమ్మార్సీ వద్ద ఓహెచ్‌పై చర్చా సమావేశంలో వారు మాట్లాడారు. గతంలో ఐచ్ఛిక సెలవును పాఠశాల మొత్తానికి వర్తింపజేసేవారన్నారు. ప్రస్తుతం పాఠశాల మొత్తానికి కాకుండా వ్యక్తిగతంగా వాడుకోవాలనడం సబబు కాదన్నారు. కార్యక్రమంలో ఆ సంఘం నాయకులు, సుధాకర్, కే రామాంజనేయులు, యూ రామాంజనేయులు, వీరాంజనేయులు, చంద్రశేఖర్ పాల్గొన్నారు.

ఘనంగా మొహర్రం వేడుకలు

శింగనమల/గార్లదిన్నె/పుట్లూరు/పెద్దపప్పూరు: శింగనమలలో మొహరం సందర్భంగా శనివారం ఘనంగా సరిగెత్తు కార్యక్రమం నిర్వహించారు. శింగనమలకు చిన్నజలాలపురం, గురుగుంట్ల, గోవిందరాయునిపేట, శింగనమల పీర్ల తరలివచ్చాయి. ఈసందర్భంగా ఈ గ్రామాల నుంచి భారీగా భక్తులు తరలివచ్చారు. శింగనమలలోని 10 చావిడిలోని పీర్లను ఎత్తారు. వీటిని శింగనమలలోని మసీదు నుంచి దర్గా వరకూ ఊరేగించారు. భక్తులు చెక్కెర చదివించారు. పోలీసులు బందోబస్తు చేపట్టారు. అలాగే గార్లదిన్నె మండలంలోని పలు గ్రామాల్లో చిన్న సరిగెత్తు వేడుకలను ఘనంగా నిర్వహించారు. అదేవిధంగా పుట్లూరు మండలంలోని ఎల్లుట్ల, చెర్లోపల్లి, నాయకునిపల్లి, కడవకల్లులో పీర్లను ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేపట్టారు. ఎల్లుట్లలో శనివారం చిన్న సరిగెత్తు సందర్భంగా పీర్లను ఊరేగించారు. అలాగే పెద్దపప్పూరు మండలంలోని పసలూరు, కొట్టాలపల్లిలో మొహరం ఉత్సవాలు నిర్వహించారు.

సంక్షిప్త సమాచారం

విద్యుదాఘాతంతో వ్యక్తికి గాయాలు

గుత్తి: గుత్తి మున్సిపాలిటీ పరిధిలోని లచ్చానపల్లి రోడ్డులో ఉన్న జగనన్న కాలనీలో శనివారం విద్యుదాఘతంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. వివరాలు.. ఫకృద్దీన్ అనే వ్యక్తి తన కొత్త ఇంటికి నీళ్ల కొట్టడానికి ప్రయత్నిస్తున్న సమయంలో విద్యుత్ వైరు తగిలి షాక్‌కు గురై కుప్పకూలి కింద పడ్డాడు. కాళ్లు, చేతులు, తలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే అతడిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం రెఫర్ చేశారు. ఘటనపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ధర్మాపురంలో మహిళకు గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని ధర్మాపురం గ్రామంలో శనివారం విద్యుదాఘాతంతో గొల్ల లక్ష్మిదేవి అనే మహిళకు తీవ్ర గాయాలయ్యాయి. వివరాలు.. గ్రామానికి చెందిన లక్ష్మిదేవి ఇంటి బయట నీటితో శుభ్రం చేస్తోంది. ఈ క్రమంలో స్తంభం వద్ద నీళ్ల చల్లుతుండగా విద్యుత్‌షాక్ తగిలి తీవ్రంగా గాయపడింది. గమనించిన భర్త ఆంజనేయులు వెంటనే ఆమెను గుత్తి ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

భూమి హద్దుల విషయంలో ఘర్షణ

యల్లనూరు: మండలంలోని కూచివారిపల్లిలో రైతులు ఆదినారాయణ, వెంకటేష్ భూమి హద్దుల విషయంలో శనివారం గొడవ జరిగింది. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్ కానిస్టేబుల్ శంకర్ నారాయణ తెలిపారు.

సోదరుల ఘర్షణ.. కేసు నమోదు

పెద్దవడుగూరు: మండలంలోని బందార్లపల్లిలో భూసమస్య నేపథ్యంలో శనివారం సోదరుల మధ్య ఘర్షణ చోటు చేసుకొంది. వివరాలు.. పెద్ద రంగస్వామి, చిన్నరంగస్వామి, పెద్దిరెడ్డి అన్నదమ్ములు. కొద్ది రోజులు వీరి మధ్య భూమి సమస్య తలెత్తింది. శనివారం చిన్నరంగస్వామి, పెద్దరంగస్వామి కలిసి పెద్దిరెడ్డిపై కట్టెలతో దాడి చేశారు. దాడిలో పెద్దిరెడ్డి తీవ్రంగా గాయపడ్డాడు. క్షతగాత్రున్ని కుటుంబ సభ్యులు అనంతపురం తరలించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

ఇసుక ట్రాక్టర్ల సీజ్

తాడిపత్రిటౌన్: మండలంలోని సజ్జలదిన్నె గ్రామ సమీపంలో పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఏడు ట్రాక్టర్‌లను సీఐ శివగంగాధర్‌రెడ్డి సీజ్ చేసారు. అనంతరం వాటిని రెవెన్యూ అధికారులకు అప్పగించారు.

9న సమ్మె విజయవంతం చేయండి

గుంతకల్లుటౌన్: ఎన్‌డీఏ కూటమి ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఈ నెల 9న కార్మిక సంఘాల ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా చేపడుతున్న సార్వత్రిక సమ్మె విజయవంతం చేయాలని భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఐఎఫ్‌టీయూ) జిల్లా ప్రధాన కార్యదర్శి బి.సురేష్ కోరారు. శనివారం స్థానిక న్యూడెమోక్రసీ పార్టీ కార్యాలయంలో సార్వత్రిక సమ్మెకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు. ఐఎఫ్‌టీయూ నాయకులు రఘునాథరెడ్డి, రామ్‌దాస్, రామాంజి, సత్తార్, జిలాన్ పాల్గొన్నారు. అలాగే సీపీఎం కార్యాలయంలో సమ్మె నిర్వహణ గురించి చర్చించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యుడు బి.శ్రీనివాసులు, సీఐటీయూ పట్టణ కార్యదర్శి నాగరాజు, జగదీష్ తదితరులు పాల్గొన్నారు.